
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 జూన్ 2023



నేడు 'చిత్రకవితా సౌరభం' పుస్తకావిష్కరణ సభ

కడప అర్బన్ : 'చిత్రకవితా సౌరభం' పుస్తకావిష్కరణ సభ ఈనెల 11న ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో చిత్ర సాహితీ ప్రచురణలు వారిచే నిర్వహిస్తామని నిర్వాహకులు అలంకారం విజయ్ కుమార్, అలంకారం ఆదిత్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షులుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ముఖ్య అతిథులుగా చిత్రకవితా సమ్రాట్ చింతా రామకృష్ణారావు (హైదరాబాదు), యువసాహితీవేత్త కందుల నాగేంద్ర వరప్రసాద్ (ఏలూరు), ప్రత్యేక అతిథిగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం రీసర్చ్ అసిస్టెంట్ డాక్టర్ చింతకుంట శివారెడ్డి, పుస్తక సమీక్షకులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధ్యాపకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, అష్టావధాని, నాటక రచయిత ఎమ్.వి.ఎల్.ఎన్.ప్రసాద్ (శారదాప్రసన్న), సభా నిర్వాహకులుగా యువసాహితీవేత్త డాక్టర్ జి.వి.సాయిప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

'ప్రయివేట్'దోపిడీ!



జిల్లాలోని అకడమిక్ విద్యా సంవత్సరం ప్రయివేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు కాసుల పంట పండిస్తోంది. ఎల్‌కెజి నుంచి ఇంటర్మీడియట్ వరకు పుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో కోట్లాది రూపాయల దోపిడీ బహిరంగంగానే సాగుతోంది. ఇటువంటి అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాల్సిన జిల్లా విద్యాశాఖ యంత్రాంగం తెలిసినప్పటికీ నిద్రావస్థలో జోగుతుండడంపై విమర్శల వర్షం కురుస్తోంది.

యథేచ్ఛగా పుస్తకాల విక్రయం
జోరుగా రూ. కోట్ల వ్యాపారం
పట్టని జిల్లా విద్యాశాఖ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీ హద్దుపద్దూ లేకుండా సాగిపోతోంది. జిల్లా వ్యాప్తంగా 2,200 ప్రభుత్వ పాఠశాలలు, 950 ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు పాఠ శాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,56,156 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా 950 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 1.40 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్య మార్కెట్ సరుకుగా మారిన నేపథ్యంలో తల్లిదండ్రుల్లోని ఆశలను, ఆకాంక్షలను సొమ్ము చేసుకునేందుకు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు కాన్సెప్ట్, టెక్నో, ఇ-టెక్నో, డిజిటల్, విజువల్ వంటి పదాల భ్రమల మాటున దోపిడీకి లాకులె త్తడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం నుంచి అనుమతులు రాకమునుపే అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో రూ.కోట్లలో వ్యాపారాల్ని సాగిస్తున్నాయి. నర్సరీ నుంచి పదవ తరగతి విద్యార్థి వరకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు. కడప నగరంలోని కొన్ని ప్రయి వేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో రూ.1.30 లక్షల వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పాఠ్య




పుస్తకాలను ప్రయివేటు పాఠశాలల్లో క్రయవిక్రయాలు చేయ కూడదని నిబంధ నలు చెబుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నర్సరీ నుంచి యుకెజి, ఎల్‌కెజి, ఐదవ తరగతి వరకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేలు, ఆరు నుంచి పదవ తరగతి వరకు రూ.ఏడు వేల నుంచి రూ. తొమ్మిది వేల వరకు వసూలు చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. యూనిఫామ్స్, టై, బెల్ట్, షూస్ పేరుతో రూ.మూడు నుంచి రూ. నాలుగు వేల వరకు లాక్కుంటున్న వైనం తెలిసిందే. మొదటి రోజునే ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్‌ను వసూలు చేసు కుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠ శాలలు, కళాశాలల్లో బహిరంగంగా అక్రమ వ్యాపారం సాగిపోతున్నా విద్యాశాఖ యంత్రాంగం నిద్రమత్తులో జోగుతుండడం విస్మ యాన్ని కలిగిస్తోంది. విద్యాసంస్థల యాజమాన్యాల లాబీయింగ్‌కు, ప్రలోభాలకు వెరసి ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల వైపు కన్నెత్తి చూడటానికి జంకుతుండడం గమనార్హం. స్థానిక సంస్థల



ప్రయివేటు, కార్పొరేట్ పా ఠశాలలు, కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయాలపై ఆందోళనలు నిర్వ హిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా అక్రమ వ్యాపారం సాగుతుంటే జిల్లా విద్యా శాఖ నిద్రపో తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- ఎస్.రాజేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కడప.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు



అకడమిక్ విద్యా సంవత్సరంలో నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలపై భారీ జరిమానాలు విధిస్తాం. ఆధారాల సహితంగా అందజేస్తే చర్యలు తీసుకోవడానికి వెరవబోం.

- వై.రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, కడప.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలకు అవకాశం కల్పించడంతో ఇష్టారాజ్యంగా సాగిపోతోంది. ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు జవాబుదారీతనాన్ని, ఆడిట్ పరిధిలోకి తెచ్చే సాధనాలైన ఫోన్‌ఫే, గూగుల్‌ఫే వంటి యాప్‌ల ద్వారా చెల్లింపులను నిరాకరించడం గమనార్హం. ఇటువంటి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలపై ఆదాయ పన్నుల శాఖ ఎందుకు దృష్టి సారించడం లేదో అర్థం కావ డం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తుండడం గమనార్హం.

మహిళా సాధికారతకు వేదిక 'మహిళా సమాజ్'

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళా సాధికారత సాధనకు, నైపుణ్య సామర్థ్యాలకు ప్రధాన వేదికగా కడప మహిళా సమాజ్ విరాజిల్లుతోందని ఆర్తి ఉమెన్స్ సెంటర్ నిర్వాహకులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ప్రశంశించారు. విజయ్ ఆర్తి హోమ్స్ ఆధ్వర్యంలో.. ఆధునాథనంగా రూపుదిద్దుకున్న నగరంలోని అతి పురాతనమైన మహిళా సమాజ్ ప్రాంగణం శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు దంపతులతో పాటు, జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్ దంపతులు, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచుకుని సంఘాలను బలోపేతం చేయాలన్నారు. మహిళల్లో దాగివున్న నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజికంగా మరింత దృఢంగా చేయడమే మహిళా సమాజం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళా సమాజాన్ని నేటి సమాజంలో మార్పులకు అనుగుణంగా మహిళా సాధికారత దిశగా అడుగులేస్తున్న ఆర్తి హోమ్ సంస్థ నిర్వహణలో మహిళలను మరింత ముందుకు నడిపిస్తారని ఆయన ఆకాంక్షించారు. నైపుణ్యాలతో కూడిన సుస్థిర జీవనోపాధులను అందిస్తూ.. మహిళల జీవన ప్రమాణాలలో మార్పు తీసుకురావాలని కోరారు. ఈ కేంద్రంలో, మహిళల సాధికారతతో పాటు, వారికి ఉద్యోగ ఉపాధి నైపుణ్యాలు, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, శానిటరీ నాప్కిన్ తయారీ, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర శిక్షణ తో పాటు, కంప్యూటర్, కమ్యూనికేషన్ శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మణి ప్రదర్శనా కేంద్రాన్ని జిల్లాలోని మహిళలు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఆర్తీహోం వారు చేస్తున్న సహాయ సహకారాల గురించి కొనియాడారు. ఆర్తీ హెూం ఫౌండర్ ప్రెసిడెంట్ సంధ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా సాధికారత కోసం ఆర్తీహోమ్ పనిచేస్తోందని చెప్పారు. సెక్రటరీ దుర్గాకుమారి మాట్లాడుతూ కేంద్రాన్ని ప్రాంభించటంలో ఉన్న ఉద్దేశాన్ని తెలుపుతూ జిల్లా యంత్రాగం అందించిన సహాయ సహకారాలకు ధన్యవాదములు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో మహిళా సమాజ్ సెక్రెటరీ సంజీవమ్మ, డిజైనర్ ఆర్కిటెక్చర్ స్వాతి, జయేష్ గణేష్ పాల్గొన్నారు.



మహిళా సమాజ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దంపతులు

కలుషిత ఆహారం తిని 42 మందికి అస్వస్థత

వైద్య సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
గ్రామంలో పర్యటించిన జిల్లా వైద్యాధికారులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాజుపాలెం మండలంలోని అరకటవేముల గ్రామం, ఎస్‌సి కాలనీకి చెందిన దాదాపు 42 మంది ఈ నెల9న రాత్రి జరిగిన ఒక వేడుకలో ఉడకేసిన అలసందల గుగ్గిలు తినడంతో అస్వస్థతకు గరై ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు.. ఎస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న కొంగలి షద్రక్ కుమార్తెకు శుభకార్యం నిర్వహించారు. ఇందులో భాగంగా అతని బంధువులు ప్రొద్దుటూరు పట్టణంలోని కిరాణా దుకాణంలో కొనుగోలు చేసిన అలసందలను తమ ఇంటిదగ్గరే ఉడకబెట్టుకొని అరకటవేములలోని వేడుకలో భాగంగా పాల్గొన్న వారికి పంచి పెట్టారు. ఈ ఉడకేసిన అలసందలను తిన్నా కొంతమందికి మరుసటి రోజు శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ సొంత వాహనం, ఆటోలో బయలుదేరి ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పతిలో చేరారు. వీరితో పాటు వేడుకలో పాల్గొన్న మరికొంత మందికి అదే రోజు ఉదయం 10 గంటల నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో కావడంతో అదే గ్రామానికి చెందిన ఆశా కార్యకర్తలు ఉమామహేశ్వరి, బయమ్మ, ఎఎన్ఎం సావిత్రి, ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్నలు 22 మందిని రాజుపాలెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిలో చిన్నపిల్లలూ ఉన్నారు. వేడుక జరుపుకుంటున్న బాలికతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి పాలు కావడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. విషయం తెలుసుకున్న డిఎంహెచ్ఎ ఖాదర్‌వలి, డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ, సూపర్‌వైజర్ ప్రసాద్ అరకట వేముల గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని స్థానిక వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ కోలుకున్న వారిని మరికొన్ని రోజులు ప్రత్యేకంగా పర్యవేక్షణలో ఉంచి ఎప్పటికప్పుడూ నివేదిక పంపాలని పేర్కొన్నారు. గ్రామంలోని హెల్త్ క్లినిక్‌లో సెలైన్‌బాటిళ్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒలు రవిశంకర్ రాజు,శంకర్ రెడ్డి, 104 సిబ్బంది పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న బాధితులు



కోలుకున్న వారిని పరామర్శిస్తున్న డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి



రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న జిఎం జ్ఞానరంజన్ సారంగి

తక్కువ వడ్డీతో రుణ సదుపాయం

- యూనియన్ బ్యాంక్ సెంట్రల్ ఆఫీస్ జిఎం జ్ఞానరంజన్ సారంగి

ప్రజాశక్తి-కడప అర్బన్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని రంగాల వారికి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నామని యూనియన్‌బ్యాంకు సెంట్రల్ ఆఫీస్ జిఎం జ్ఞాన రంజన్ సారంగి పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం కడప వారు కస్టమర్ మెగా అవుట్ రీచ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బ్యాంక్ పథకాల గురించి ఖాతా దారులకు అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతా దారుల కోసం నూతన పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. యూనియన్ సమ్మాన్ పథకం పెన్షన్ దారుల కోసం యూనియన్ సమృద్ధి, యూనియన్ ఉన్నతి, మహిళా ఖాతాదారుల కోసం, కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ దారుల కోసం ఒక కొత్త పథకాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. తమ బ్యాంక్ వివైఒఎం యాప్ ద్వారా 350 ప్లస్ ఫీచర్స్‌ను అందిస్తుందని చెప్పారు. తమ బ్యాంకు స్వదేశీ, విదేశీ విద్య రుణాలను రూ.40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా అందిస్తున్నామని తెలిపారు. కడప ప్రాంతీయ కార్యాలయ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ తమ 49 శాఖల ద్వారా ఖాతా దారులకు అన్ని రకాల వ్యవసాయ, విద్య, గృహ, వాహన, వ్యాపార, ఆసుపత్రులకు తక్కువ వడ్డీతో రుణాలు అంది స్తున్నామని పేర్కొన్నారు. తమ బ్యాంకు యూనియన్ నారి శక్తి అనే స్కీం ద్వారా మహిళలకు అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జనరల్ మేనేజర్ రంజన్ తమ ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు శాఖ మేనేజర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 1100 పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

హైదరాబాదు నగరంలో ఉంటున్న దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు (500 పుస్తకాలు), ప్రముఖ సాహితీవేత్త, నటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ (200 పుస్తకాలు), రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి (200 పుస్తకాలు), విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ (200 పుస్తకాలు) కలసి మొత్తం 1100 పుస్తకాలను శనివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి, డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ ఇచ్చిన పుస్తకాల్లో చాలావరకు ఇంతవరకు గ్రంథాలయంలో లేని పుస్తకాలు ఉండడం విశేషమని అన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి, డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మలను యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

ప్రజలందరూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. శనివారం కొరపాటి పల్లెగ్రామ పంచాయతీలోని దుగ్గాయిపల్లెలో గడప గడప ప్రోగ్రాంలో భాగంగా నవరత్నాలలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆమెతోపాటు ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్ , వైస్ ఎంపిపిలు సిఎంబాష, చె న్ను రాజశేఖర్, , కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

18న విద్యుత్ సంస్కరణలపై సిపిఎం సదస్సు

- కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ రాక

ప్రజాశక్తి - కడప అర్బన్

'విద్యుత్ సంస్కరణలు-భారాలు-తక్షణ కర్తవ్యం' అనే అంశంపై ఈనెల 18న సాయంత్రం నగరంలోని పాత బస్టాండ్ సిపిఎం కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యులు ఫారుక్ హుస్సేన్, మహబూబ్ తార తెలిపారు. ఆ మేరకు నగరంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. ముఖ్య అతిథిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు. వీరితోపాటు నగర నాయకత్వం కూడా ఉపన్యాసకులుగా హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు, సంస్థలకు కట్టబెట్టే చర్యల్ని వేగవంతం చేసిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి, మరోవైపు ఆ భారాన్ని వినియోగదారులపై వేయడం సరైందికాదన్నారు. మెరుగైన విద్యుత్ ఇస్తామని ప్రకటించి, పెద్ద ఎత్తున విద్యుత్ కోతలు, భారాలు వేస్తున్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానికాన్ని చైతన్యవంతం చేసేందుకు సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

రక్తదానానికి యువత ముందుకు రావాలి

కడప : రక్తదానం ప్రాణదానంతో సమానం అని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కడప జిల్లా గృహ సహకార నిర్మాణ సంఘం చైర్మన్ జయభారత్ రెడ్డి అన్నారు. శనివారం రాయల్ కరిముల్లా ఆధ్వర్యంలో రక్తదానం కరపత్రాలను జయభారత్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరం అని, అలాంటి వారి ప్రాణాలు రక్షించేందుకు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కరీముల్లా చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

'సోమశిల' నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తాం
- చెక్‌పోస్టు సమస్యను పరిష్కరిస్తాం
- వైసిపి ఇసుక దాహం రాష్ట్ర ప్రజలకు శాపం
- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-అట్లూరు

వైసిపి దొంగల ఇసుక దాహంతో రాష్ట్రంలోని ప్రజలకు శాపంగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 122 రోజుకు చేరుకుంది. శనివారం కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని జంగాలపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై అట్లూరు క్రాస్, రెడ్డిపల్లె, కొండూరు, బాలిరెడ్డిబావి, నది యాబాద్ విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, రైతులు, ఎస్‌సి సామాజిక వర్గీయులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి సిద్దవటం మండలం జంగాలపల్లె వద్ద పెన్నానదిని తోడేస్తున్నారని విమర్శించారు. అనధికారికంగా పోగేసిన ఇసుక డంపింగ్ యార్డును పెన్నానది పక్కనే ఉన్నా స్థానికులకు మాత్రం ఇసుక అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు ఇక్కడ నుంచి ఇసుక తరలించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నా ఎస్ఇబి అధికారులకు కనపడదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి పాపాలపుట్ట మాదిరి పెరిగిపోతున్న ఈ ఇసుక మేట రాష్ట్రంలో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియాకు ప్రత్యక్షసాక్షి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని అన్నారు. కొత్తగా ప్రాజెక్టులు కట్టడం చేతగాని జగన్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దారుణమని పేర్కొన్నారు. చింటువారిపల్లి సోమశిల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు తక్షణమే పరిహారం అంద జేయాల్సిందిగా ప్రభుత్వానికి లేఖరాస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందని చెప్పారు. జగన్ ప్రభుత్వం రాయలసీమ రైతాంగానికి శాపంగా తయారై ందన్నారు. గతంలో 90 సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేయగా, ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. చీనీ రైతుల గిట్టుబాటు ధర కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారని, రాయలసీమ రైతుల కష్టాలు చూశాకే సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దాలని మిషన్ రాయలసీమలో ప్రకటించామని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వం రాయ లసీమలో ప్రాజెక్టుల కోసం రూ. 11,700 కోట్లు ఖర్చుచేస్తే, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగోవంతు కూడా ఖర్చుచేయలేదని విమ ర్శించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్‌కు అందజేసిన రాయితీలన్నీ తిరగి ప్రవేశపెడతామని తెలిపారు. చీనీ రైతులకు కోల్డ్ స్టోరేజిలు, మెరుగైన మార్కె టింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రెడ్డిపల్లి, కొండూరు, అట్లూరు గ్రామాల ప్రజలకు చెక్ పోస్టు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటుకు కావాల్సిన చీనీ రకాలు పెంచేలా ప్రోత్సహిస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్టుబడి తగ్గేలా ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అన్ని తక్కువ రేటు కి అంద జేస్తామని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. గతంలో ఇచ్చినట్టే డ్రిప్ సబ్సిడీలో అందజేస్తామన్నారు. కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చీనీ రైతుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. దళితుల నుండి 12 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కు న్నారని విమర్శి ంచారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ విదేశీవిద్య ద్వారా దళిత విద్యార్థులను విదేశాలకు పంపి చదివించామని తెలిపారు. అధికాంలోకి వచ్చిన తరువాత గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసా గిస్తామన్నారు. గిరిజనులు స్వేచ్ఛగా అడవుల్లోకి వెళ్లి వెదురు తెచ్చుకునే హక్కు కల్పి స్తామన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు సబ్సిడీ రుణాలు అందజేస్తాం, గిరిజనులకు పోడు భూములు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి కుమార్తె కైవల్యా రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు.



చీనీ రైతులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నారా లోకేష్

నిరసన

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇసుక రీచ్‌ల పరిధిలోని గ్రామాల్లో నిరసన ధ్వనులు మిన్నంటాయి. జిల్లాలో పెరుగుతున్న జనాభా అవసరాల నేపథ్యంలో నిర్మాణ రంగ ఆవశ్యకత పెరిగింది. ఇందుకు కావాల్సిన వనరుల్లో ఇసుక, మట్టి, ఇటుక, సిమెంటు కీలకమైనవి. ఇటువంటి వనరుల్లో ఇసుక, మట్టి సహజ సిద్ధంగా లభించే వనరులు. వీటిని ఏప్రభుత్వం అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకులు కొల్లగొట్టడం పరిపాటిగా మారింది. ఇసుక రీచ్‌ల పరిధి, పరిమాణాన్ని ఆధారం చేసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకుని తరలించడం యథేచ్ఛగా సాగిపోతోంది. అనుమతుల కోసం అధికారులపై తీవ్రమైన ఒత్తిడి చేయడం భారీగా సొమ్ము చేసుకోవడం నిత్యకృత్యమైంది. ఇటీవల చెర్లోపల్లి చెరువును కొల్లగొట్టడాన్ని నిలువరించడానికి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. సదరు మట్టి తరలింపు వ్యవహారం సద్దుమణగక ముందే ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం తెరపైకి రావడం విస్మ యాన్ని కలిగిస్తోంది. అధికార పార్టీ నాయకులు సహజ వనరు లను ఏతీరులో కొల్లగొడుతున్నారో అర్థం చేసుకోవాలి. ఇసుక, మట్టి అక్రమ తరలింపు వ్యవహారాలను నిలువరించాల్సిన ఉన్నతాధికా రులు చేష్టలుడి కళ్లప్పగించి చూడాల్సి వస్తోంది. దీనికి కారణం జిల్లాలో పని చేయాలంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ప్రాపకం ఉండాల్సి రావడం. అధికార పార్టీలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అనుగ్రహం ఉండాలి. వారి లెటర్లు దగ్గర ఉంచుకోవాలి. ఇటువంటి వాతావరణంలో అధికారులు నిజాయితీగా పని చేయడం అసాధారణ విషయమే. నిజాయతీగా పని చేస్తే డీమోట్ చేయడం, బదిలీలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల బ్రహ్మంగారిమఠం తహశీల్దార్ అసైన్‌మెంట్‌లో అధికార పార్టీకి చెందిన నాయకుల అను చరుల పేర్లు పెట్టలేదనే విషయంలో తలెత్తిన వివాదంలో సదరు తహశీల్దార్‌ను డీమోట్ చేయడం తెలిసిందే. ఇటువంటి కలుషిత రాజకీయ వాతావరణంలో నిజాయతీగా విధులు నిర్వహించడం కత్తిమీద సామే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా పెచ్చుమీరింది. జిల్లాలోని పలు ఇసుకరీచ్‌ల పరిధిలోని గ్రామాల గుండా భారీ వాహనాలతో ఇసుకను తరలించడాన్ని గ్రామీ ణులు అడ్డుకుని నిరసనలు తెలుపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కొండాపురం మొదుకుని యర్రగుంట్ల, మైదుకూరు రాజంపేట, రాయచోటి తదితర ప్రాంతాల్లోని ఇసుక అక్రమ రవాణా చేయడాన్ని నిరసనలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. అక్రమ రవాణాను నిలువరించడంలో అధికారులు నిమిత్తమాత్రులుగా మారడంతో అక్ర మార్కులు స్వైరవిహారం చేస్తున్నారు. ఇక్కడ నుంచి చెన్నయ్, బెంగ ళూరు మెట్రోపాలిటన్ పట్టణాలకు తరలిస్తూ కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు సైతం కుమ్మక్కు వ్యవ హారాలు సాగిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీంతో అధికార పార్టీ నాయకుల అక్రమాలను నిలదీసే హక్కును ప్రతిపక్ష టిడిపి కోల్పోయింది. ప్రజల నిరసనలను సైతం రాజకీంగా సొమ్ము చేసు కునే పరిస్థితుల్లో టిడిపి లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇటు వంటి అంది వచ్చిన అవకాశాలను విస్మరించడం వంటి కారణా లతో ప్రతిపక్ష టిడిపి బలహీనతకు కారణమని గుర్తించుకోవాలి. సహజ వనరుల దోపిడీ నిలువరించడాన్ని విస్మరించి, ఇతర అంశా ల్లో సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేయడానికి పరి మితం కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం కదలి ఎక్కడిక్కడే అక్రమ తరలింపు వాహ నాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేసి విచారణ చేపట్టడం వంటి చర్యలకు దిగినప్పడే అక్రమ రవాణాకు ముకుతాడు పడుతుందని చెప్పవచ్చు. లేనిపక్షంలో జీవ నదుల్లోని ఇసుకను సైతం తోడేసే ప్రమాదం పొంచి ఉంది.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

ఆలయానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని నాగసానిపల్లె ఎస్‌టి కాలనీలో శ్రీ సేవాలాల్ మహారాజ్, మారెమ్మ తల్లి ఆలయానికి ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబుబాకర్ సిద్ధిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచు నక్క సుధాకర్, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎస్.రఘురామిరెడ్డి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ఆయన కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న భవన కార్మికుల సమస్యలపై ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు పెండింగ్ క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, సిద్దయ్య, కృష్ణయ్య, చిన్న టోపీ, కార్పెంటర్ అంజి, బాషా, గంగరాజ, బాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

పిఆర్ఎల్ బస్సు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని పిఆర్ఎల్ బస్సు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల నుండి అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని, బస్సు యాజమాన్యంపై రవాణా శాఖా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలు, డిమాండ్ బట్టి ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కావల్సిగానే సీట్లు బ్లాక్ చేసి ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ బస్సు ఛార్జీలు రూ.650 ఉంటే వీరు రూ.700 నుండి రూ.900 వరకు అదనంగా ఛార్జీలు అవసరాన్ని బట్టి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలకు వెయిటింగ్ గదులు లేవన్నారు. బస్సు పార్కింగ్ పాయింటు కూడా లేకుండా నడుపుతున్నారన్నారు. రవాణాశాఖ అధికారులు పిఆర్ఎల్ బస్సు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో శనివారం పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామానికి చెందిన బండి ఓబుల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన కుమారుడు బండి చంద్ర బాబురెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా వృద్ధులకు, అంధులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, అంధుల ఆశ్రమ నిర్వాహకుడు రామ్మోహన్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వల్లూరు

ఆదర్శ పాఠశాల 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఆదివారం ఆరవ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు 9 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకొని ఉపాధ్యాయులకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజల్లోకి టిడిపి మినీ మేనిఫెస్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల్లోకి టిడిపి మినీ మేనిఫెస్టోను తీసుకు వెళ్తున్నట్లు ఆ పార్టీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, పరిశీలకులు కరణం రామవెూహన్ రావు తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం వారు మినీ మేనిఫెస్టో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశక్తి యువగళం, అన్నదాత పథకం, బిసిలకు రక్షణ చట్టం, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, పథకాలు ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు, అన్యాయాలు ప్రజలకు వివరిం చాలన్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. సైకో జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి ప్రజలందరూ కలిసి తరిమికొట్టాలని వారు కోరారు. కడప నియోజవర్గంలో మళ్లీ టిడిపి జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, రాష్ట్ర, నగర నాయకులు, పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

కళలలో కూడా రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చిన్నారులు చదువుతోపాటు చిన్నతనం నుంచే వివిధ కళల రంగాలలోనూ రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పోలా శ్రీనివాసులురెడ్డి, బిజెపి రాష్ట్ర పొలిటికల్ ఫీడ్ బ్యాక్ కమిటీ సభ్యులు, రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి సాయి లోకేష్ తెలిపారు. శనివారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో ఎఆర్ డాన్స్ అకాడమీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు డ్యాన్స్ మాస్టర్ అభిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో చిన్నారులు చేసిన వెస్టర్న్, శాస్త్రీయ నృత్యాలు, ఒళ్ళు గగుర్పొడిచే మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, సాయి లోకేష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకా రులు, కళలు గౌరవించబడినచోట ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. చిన్నారులు చదువుతోపాటు సాంస్కృతిక కళలలో కూడా రాణించాలని తెలిపారు. నృత్య సాధన వలన శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుందని తద్వారా పిల్లలు చదువులో కూడా రాణించగలుగుతారని అన్నారు. ఆడుతూ పాడుతూ శరీరానికి వ్యాయామాన్ని ఇచ్చేదే డాన్స్ అని తెలిపారు. ఎఆర్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్యాన్స్ తో పాటు మార్షల్ ఆర్ట్స్, మ్యాజిక్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి కళలలో శిక్షణ ఇస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయ కులు కోలాటం హరి, ఎపిఎంఆర్‌పిఎస్ నాయకులు బొజ్జా పెంచలయ్య, హిపాప్ స్టైల్ డ్యాన్స్ మాస్టర్ సాయి వంశీ రెడ్డి, స్టూడియో సుబ్బు పాల్గొన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

ఖరీఫ్ సాగుకు రైతుల సన్నద్ధం


రుతుపవనాల రాకే ఆలస్యం - వేరుశనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఖరీఫ్ సీజన్ సమయం ఆసన్నం కావడంతో రుతుపవనాల రాక కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతిఏటా జూన్ నెలలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం సహజం. ఈ క్రమంలో రాష్ట్రంలో రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న రోహిణి కార్తె కూడా వెళ్లిపోతుండడంతో.. ఇక ఎండలు తగ్గుముఖం పడతాయనే ఆశలు రైతుల్లో చిగురిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ మొదటి వారం పూర్తయింది. మరోవైపు ఖరీఫ్ సీజన్‌కు సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం జూన్ రెండో వారం ముగిసేలోపు రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సమయానికి రుతుపవనాలు ప్రవేశించడం, వాటి ప్రభావం వల్ల కాస్త చినుకులు రావడం పరిపాటి. ఇంతవరకు చినుకు జాడ లేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. మరోవైపు ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రాయితీపై విత్తన కాయలను అందించడం కూడా పూర్తయింది. కానీ వేరుశనగ సాగు పట్ల రైతులు మక్కువ చూపలేదు. గతంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగను ప్రధాన పంటగా వేసేవారు. దీనివల్ల రాబడితోపాటు పశువులకు గ్రాసం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. కానీ వేరుశనగ సాగుకు విపరీతమైన ఖర్చు రావడం, చేతికొచ్చిన తర్వాత గిట్టుబాటు ధర లభించని కారణంగా వేరుశనగ సాగుకు రైతులు మొగ్గుచూపడంలేదని తెలుస్తోంది. వేరుశనగ సాగు మధ్య స్థితికి వచ్చేసరికి వైరస్ ప్రభావం చూపుతోందంటూ రైతులు మరో కారణం కూడా చెబుతున్నారు. ఏది ఏమైనా సకాలంలో రుతుపవనాలు ప్రవేశిస్తే రైతుకు అన్ని విధాల శ్రేయస్కరంగా ఉంటుంది. ఆలస్యంగా వస్తే వేరుశనగ స్థానంలో ప్రత్యామ్నాయ పంటలపై ఆధార పడాల్సి వస్తుంది. కావున వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నట్లు త్వరలో రుతుపవనాలు ప్రవేశించి పదును వర్షాలు కురవాలని, ఖరీఫ్ రైతుకు ప్రకృతి సహకరించాలని కోరుకుందాం.


రుతుపవనాలు రాక కోసం ఎదురుచూస్తున్న రైతు

పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, సిఐటియు పట్టణ నాయకులు దాసరి విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు దాదాపు 40,000 మంది ఉన్నారన్నారు. వీరిని క్రమబద్ధీకరించాలన్నారు. ముఖ్య మంత్రి ప్రతిపక్ష నాయకుడి హోదాలో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని శాసనసభలో ప్రకటిం చార న్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినా కూడా ఆ హామీని నెరవేర్చ లేదన్నారు. కరోనా మహమ్మారి వంటి విపత్తుల పరిస్థితుల్లో కార్మికులు వారి కుటుంబాలను వదిలి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలు చేశారన్నారు. వారి సేవలు మరువలేవని ప్రధాని నరేంద్ర మోడీ కూడా కొనియాడారని అన్నారు. 010 పద్దు కింద మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు (2016) ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించి, క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం చెల్లించాలన్నారు. కార్మికులకు కనిస వసతులు కల్పించాలన్నారు. పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచి, వారికి రక్షణ, భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. పనిముట్లు, యూనిఫాం సకాలంలో అందించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న , శివ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సున్నపు రాళ్లపల్లె గ్రామంలో శనివారం ఉదయం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. స్థానిక సమ స్యలను తెలుసుకుని పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీల కతీతంగా పేదలకు అందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం సచివాలయ, వాలంటరీ వ్యవస్థలకు శ్రీకారం చుట్టిం దన్నారు. వాలంటీర్ల ద్వారా పేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ ఉండడంతో వారి జీవితాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి అశ్విని, ఎంపిటిసి శశికళ, వైసిపి నాయకులు ఓబుల్‌రెడ్డి, మునిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మండలాధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే లోకేష్ తిరిగే పరిస్థితి ఉండదు

ప్రజాశక్తి - కడప

అవాస్తవాలు మాట్లాడుతూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే ఇక లోకేష్ తిరిగే పరిస్థితి ఉండదని జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ లోకేష్‌ది ఫ్యాషన్ యాత్ర అని ఎద్దేవా చేశారు. లోకేష్ ఎన్ని విమర్శలు చేసినా రాజంపేటలో వైసిపి అభ్యర్థిదే గెలుపు అని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు పెద్ద కబ్జాదారుడని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడేది వారేనన్నారు. లోకేష్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా, తాము సంయమనం పాటిస్తున్నామన్నారు. ఆకేపాడులో తాము తరతరాలుగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ప్యాలెస్ కట్టుకున్నామన్నారు. అక్రమంగా సంపాదించుకున్నామని ఆరోపించడం అసత్యం అన్నారు. నేను ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే వారికే ఇచ్చేస్తానన్నారు. మాది భూస్వామి కుటుంబం, వందల ఎకరాల భూములున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి టిడిపి నుంచి వైసిపిలోకి వచ్చినప్పుడు చంద్రబాబు ఎన్నిసార్లు తనను సంప్రదించారో తెలుసుకోవాలన్నారు. తాను నిజాయితీగా ఉన్నానని తెలిపారు. టిడిపి విమర్శలతో వైసిపి ఇంకా బలపడుతోందని అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. చౌకబారు విమర్శలపై వైసిపి కార్యకర్తలు లోకేష్‌పై మండి పడుతున్నారని అన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

రేపటి నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి నెలరోజులపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణనిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గ్రామీణ నిరుద్యోగ మహిళలు ఈ అవాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18-45 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణను పొందేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు


వేంపల్లెలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

సినీ నటుడు, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను శనివారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో తన టిడిపి కార్యకర్తల మధ్య, మాజీ ఎంపిటిసి సంటెన్న కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎల్‌బిఆర్ భాస్కర్‌రెడ్డి, నల్లగారి కృష్ణారెడ్డి, పివి రమణ, శ్రీరామిరెడ్డి, మహేష్‌బాబు, గోటూరు నాగభూషణం, కత్తులూరు మల్లికార్జున, ఇలియాస్, మహ బూబ్ షరీఫ్, ఎద్దుల కొండ్రా యుడు, మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి, పోతిరెడ్డి శివ, ఆంజనేయులు, సుబ్బరాయుడు, శేఖర్, శ్రీనివాసులు, వెంకటయ్య, నాగశేఖర్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రముఖ సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను మండలంలోని దుంపలగట్టు గ్రామంలో రెడ్యం తనఇంట్లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రెడ్యం మాట్లాడుతూ బాలకృష్ణ పాత్రలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యులు, రెడ్యం వెంకటసాయి ప్రత్యూష్‌రెడ్డి, రెడ్యం శ్రీకాంత్‌రెడ్డి, రెడ్యం ధీరజ్‌రెడ్డి, మనవళ్లు విక్కీ, రిక్కీ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న రెడ్యం కుటుంబసభ్యులు

ఎర్రగుంట్ల : స్థానిక హేమ సినిమా హాలులో శనివారం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో బాలకృష్ణ ప్రజలకు పలు సేవలు చేస్తున్నారని, అందులో భాగంగానే బసవతారకం ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచిత క్యాన్సర్ వైద్యాన్ని అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, పెద్ద సేర్, సంజీవ్‌రెడ్డి, మహబూబ్ షరీఫ్, నాగభూషణ్‌రెడ్డి, రమణారెడ్డి, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చాపాడు : ఖాదర్‌పల్లె గ్రామంలో ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ మైనారిటీ సభ్యులు టి.అబ్దుల్ కరీమ్ ఆధ్వర్యంలో శనివారం సినీ కథానాయకులు బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు నాయబ్ రసూల్, మొగిలి రామ్మోహన్, రజినీ, సలీం, టిడిపి నాయకులు టి.మహబూబ్‌బాషా, సలీం, రజనీ, పి.మహమ్మద్, ఫకృద్దీన్, వడ్ల, రహమత్‌అలీ, బాషా, నిజామ్ పాల్గొన్నారు.


క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సమస్యల్ని డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి

- జడ్జి ఎం.ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి - కడప

ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. చిన్నముక్కపల్లి లోని పునీత్ లారెన్స్ వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. వృద్ధుల సంరక్షణ, భద్రతను విస్మరిస్తే గరిష్టంగా మూడు నెలలు జైలుశిక్ష లేదా అపరాధ రుసుం రూ.5వేలు విధిస్తారన్నారు. ఒకోసారి రెండూ విధిస్తారని ఆయన వివరించారు. అర్హులు తగిన సమాచారం, సూచనలు, న్యాయ సేవల కోసం ప్రతి ఆర్‌డిఒ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారి కడప, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజంపేట, రెవెన్యూ డివిజన్ అధికారి జమ్మలమడుగులో సంప్రదించవచ్చన్నారు. అప్పిలేట్ అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 14567పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఓల్డేజ్ హోం నిర్వాహకులు చెన్నయ్య, పారా లీగల్ వాలంటరీ అరుణకుమారి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎం ప్రదీప్‌కుమార్

గండిక్షేత్రంలో అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప నగరం సంగంపేట వాస్తవ్యులు కీర్తిశేషులు చిట్టెం క్రిష్ణమూర్తి ధర్మపత్ని సుబ్బమ్మ కుటుంబసభ్యులు రూ.1,00,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి చిత్ర పటం, కండువా, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


దాతలకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎసి

13న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈనెల 13న ఉదయం 11 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని జమ్మలమడుగు డిఇఇ వై.శేషగిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం వేదికను పొద్దుటూరులోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణం పవర్ హౌస్ కాంపౌండలో ఏర్పాటు చేశామన్నారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను రాత పూర్వకంగా తెలియజేయాలని డిఇఇ కోరారు.


పంటను పరిశీలిస్తున్న సభ్యులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - లింగాల

ప్రకృతి వ్యవ సాయంతో అధిక లాభాలు పొందవచ్చని పలువురు మహిళ రైతులు తెలిపారు. కడప నుంచి వచ్చిన విమర్శన్ టీం సభ్యులు రాజశేఖర్, రంగయ్య శని వారం మండలంలోని వెల్లిదండ్ల చిన్న కుడాల రామ నూతనపల్లి గ్రామాల్లో పర్యటించారు ఈ సందర్భంగా మహిళా రైతులు పండించిన విధానాన్ని టీం సభ్యులకు తెలియజేశారు. గతంలో తాము రసాయన ఎరువులతో వ్యవసాయం చేసేవాళ్లమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడం మొదలు పెట్టిన తర్వాత భూమిలో మార్పులు వచ్చి, ఆరోగ్యమైన ఉత్పత్తులు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, ఎన్ఎఫ్ఎఫ్ నరసింహారెడ్డి, కృష్ణయ్య, నీలావతి, ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ అరుణ, సులోచన పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

దేశ సమైక్యత, సమగ్రత కోసం సమరశీల పోరాటాలకు సమయత్తం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం ఆయన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చిందన్నారు. కరువు, వలసలు, ఆత్మహత్యల నుండి శాశ్వత విముక్తికి నీటిపారుదల ప్రాజక్టులు గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, కెసి కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణ, రాజోలి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు పిశ్రీరాములు, కెసి బాదల్లా, పి.చంద్రశేఖర్, జి వేణుగోపాల్, సావంత్ సుధాకర్, వలరాజు, జకరయ్య, శివరాం, పిసియం రాజు, మస్తాన్, షరీఫ్, బాలు, పివి రమణ, రవికుమార్, ఇమ్మానియేల్, భాస్కర్, హృదయనాథ్ పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులపై దాడులను అరికట్టాలి

- మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పట్నం రాజేశ్వరి

ప్రజాశక్తి - కడప

మహిళలపై, చిన్నారులపై దాడులను అరికట్టాలని మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మహిళ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'ప్రమాదంలో రాజ్యాంగం- రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత' అనే అంశంపై రాను టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, సంచార జాతుల సంఘం అధ్యక్షురాలు రుద్రాక్షల ఇందిరాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ రోజు రోజుకూ మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి అని అన్నారు. దాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని తుడిచిపెట్టి మనువాదాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికైనా మహిళలు చైతన్యమై భారత రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే మళ్లీ వంటింటికి పరిమితం అవ్వాల్సి వస్తుందని ఆమె అన్నారు. బహుజనులంతా ఏకమై భారత రాజ్యాంగాన్ని కాపాడుకొని అంతిమంగా రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు గురప్ప, ప్రజా సంఘాలు సోమన్న, జయరాం, అడ్వకేట్ ప్రభాకర్, పాస్టర్ పి.మహేష్, సత్యరాజు, రామాంజనేయులు, రోజామని, భాగ్యలక్ష్మి , పద్మావతి, మక్బుల్ భాష, కిరణ్ సత్యపాల్, రెడ్డన్న, స్వామినాథం, రవికుమార్, నాగరాజు, మహమ్మద్ బహుద్దిన్, ఆంజనేయులు, సివిఆర్ ప్రసాద్ ,మహిళా ఐక్యవేదిక రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మ, నంద్యాల జిల్లా కార్యదర్శి భాను , సిరిగిరి లక్ష్మి పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ప్రతి విద్యార్థికీ క్రీడలు ముఖ్యం

పీలేరు : ప్రతి విద్యార్థికీ క్రీడలు చాలా అవసరమని ఎఎస్ఒ రామ్మోహన్ తెలిపారు. పీలేరు–మదనపల్లి మార్గంలోని హోత్రిశ్రీ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన బ్యాట్మింటన్ వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమానికి ఎఎస్ఒ రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు దృష్ట్యా మనం పీల్చే గాలి, తినే ఆహారం విషతుల్యం అవుతున్నాయని, శారీరకంగా దృఢంగా లేకపోతే వయసుతో సంబంధం లేకుండా అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. క్రీడల ద్వారా పిల్లలు శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం పొందుతారని చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా ఉంటా యని పేర్కొన్నారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వహించిన టోర్నమెంట్ సింగిల్స్ విభాగంలో విన్నర్ తాహిర్, రన్నర్ గా రోహిత్ వర్మ నిలిచారు. డబుల్స్ విభాగంలో రోహిత్ వర్మ, సాత్విక్ జంట విన్నర్స్ గా నిలిచారు. విజేతలకు అకాడమీ స్థలదాత వంశీకృష్ణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హోత్రితిశ్రీ అకాడమీ నిర్వాహకులు, జాతీయ బ్యాట్మింటన్ క్రీడాకారులు, కోచ్ టి. ప్రభాకర్ రెడ్డి, టి. హెూత్రిశ్రీ, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

కార్గో సేవల్లో భద్రత కరువు

- వసూళ్లు మాత్రం అధికం
- సకాలంలో చేరుతాయన్న నమ్మకమూ అంతంత మాత్రమే
- వస్తువు డెలివరీ కోసం రోజులు తరబడి వేచి ఉండాల్సిందే
- ఆరుబయటే విలువైన వస్తువులు



ఇరుకు గది కావడంతో ఆరుబయట పడేసిన డెలవరీ వస్తువులు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల ద్వారా కార్గో సేవలు పేరుతో ఒక చోట నుంచి మరొక చోటకు లెటర్లను, పలు రకాల వస్తువులను చేరవేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్‌లో కార్గో సేవను ఇరుకైన గదిలో నిర్వహిస్తున్నారు. గది చాలక పోవడంతోఓ వస్తువులన్నింటినీ ఆరు బయట ఎక్కడపడితే పడేస్తున్నారు. ప్రజల విలువైన వస్తువులకు భద్రత కూడా లేకుండా పోతోంది. ముఖ్యంగా మామిడిపండ్ల సీజన్ కాలంలో రైతులు కార్గో ద్వారా ఇతర ప్రాంతాలకు పంపించేందుకు ఆర్‌టిసి సేవలను పొందుతున్నారు. .ఆర్టిసి కార్గో సేవలో 25 కేజీల వరకు రూ. 80 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారు. బయట నుంచి వచ్చిన వస్తువులు, పార్శిళ్లకు భద్రత లేకుండా ఎక్కడబడితే అక్కడ పడేయడం ఉండడం గమనార్హం. విలువైన కవర్ సకాలంలో తమకు అవసమైనవారికి అందించాలనే ఉద్దేశంతోనే కార్గో ద్వారా డబ్బులు కట్టి పంపుతుంటారు. అలాంటి కవర్లు కూడా రాయచోటి బస్టాండ్‌లో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ ఉండడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా ఆర్‌టిసి వారు కార్గో సేవ పేరుతో వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ భద్రత అనేది లేదని పలువురు ఆరోపిస్తున్నారు. విలువైన వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయంతో వాటిని తీసుకోవాలని వచ్చే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు .ఒకవేళ అకాల వర్షం కురిసినప్పుడు ఈ వస్తువుల పరిస్థితి ఏమిటి అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ఆకతాయిలో అక్కడ ఉన్నటువంటి కవర్లను, విలువైన వస్తువులను తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యారంటూ ఆరోపిస్తున్నారు. ఏదైనా పార్సెల్ కోసం వెళ్లి అక్కడున్న సిబ్బందిని కార్గోలో వచ్చినాయని సిబ్బందిని అడిగితే సరైన సమాధానం కూడా సిబ్బంది చెప్పడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు రాయచోటి కార్గో సేవలలో కొంత నేలపాటు, ప్రజల విలువైన వస్తువులకు భద్రత కల్పించాల్సిన అవసరమెంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి

కార్గోలో పంపే వస్తువులకు ఆర్‌టిసి అధికారులు షెల్టర్ ఏర్పాటు చేయాలి. కార్గోదార పంపే వస్తువులు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. కార్గో వస్తువులకు షెల్టర్‌ను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేయాలి. కార్గోలు పెట్టి వస్తువులను ప్రతి 30 నిమిషాలకు ఒకసారి పంపేందుకు చర్యలు తీసుకోవాలి.

- నరసింహులు, కొత్తపేట, రాయచోటి.

త్వరలో సెంటర్ ఏర్పాటు చేస్తాం

ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణం పనులను చేపడుతున్నాం. నెల తర్వాత కొత్త బస్టాండ్ ఆవరణంలో కార్గో కోసం రెండు గదులు నిర్మించాం. అందులో కార్గో వస్తువులు సరిపోయే విధంగా గదులను ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బందికి పని ఒత్తిడి వల్ల డెలవరీ కొంచెం ఆలస్యం ఉంటుంది. ప్రయాణికులు పంపించే వస్తువులను ప్రతి 30 నిమిషాలకు ఒకసారి పంపించేందుకు చర్య తీసుకుంటాం.

-ధనాంజనేయులు, ఆర్‌టిసి డిపో మేనేజర్, రాయచోటి

'సోమశిల' నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తాం
- చెక్‌పోస్టు సమస్యను పరిష్కరిస్తాం
- వైసిపి ఇసుక దాహం రాష్ట్ర ప్రజలకు శాపం
- పాదయాత్రలో నారా లోకేష్



చీనీ రైతులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నారా లోకేష్

ప్రజాశక్తి–అట్లూరు

వైసిపి దొంగల ఇసుక దాహంతో రాష్ట్రంలోని ప్రజలకు శాపంగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 122 రోజుకు చేరుకుంది. శనివారం కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని జంగాలపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై అట్లూరు క్రాస్, రెడ్డిపల్లె, కొండూరు, బాలిరెడ్డిబావి, నదియాబాద్ విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, రైతులు, ఎస్‌సి సామాజిక వర్గీయులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి సిద్దవటం మండలం జంగాలపల్లె వద్ద పెన్నానదిని తోడేస్తున్నారని విమర్శించారు. అనధికారికంగా పోగేసిన ఇసుక డంపింగ్ యార్డును పెన్నానది పక్కనే ఉన్నా స్థానికులకు మాత్రం ఇసుక అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు ఇక్కడ నుంచి ఇసుక తరలించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నా ఎస్ఇబి అధికారులకు కనపడదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి పాపాలపుట్ట మాదిరి పెరిగిపోతున్న ఈ ఇసుక మేట రాష్ట్రంలో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియాకు ప్రత్యక్షసాక్షి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని అన్నారు. కొత్తగా ప్రాజెక్టులు కట్టడం చేతగాని జగన్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దారుణమని పేర్కొన్నారు. చింటువారిపల్లి సోమశిల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు తక్షణమే పరిహారం అంద జేయాల్సిందిగా ప్రభుత్వానికి లేఖరాస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందని చెప్పారు. జగన్ ప్రభుత్వం రాయలసీమ రైతాంగానికి శాపంగా తయారైందన్నారు. గతంలో 90 సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేయగా, ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. చీనీ రైతుల గిట్టుబాటు ధర కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేశారని, రాయలసీమ రైతుల కష్టాలు చూశాకే సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని మిషన్ రాయలసీమలో ప్రకటించామని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వం రాయలసీమలో ప్రాజెక్టుల కోసం రూ. 11,700 కోట్లు ఖర్చుచేస్తే, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగోవంతు కూడా ఖర్చుచేయలేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్‌కు అందజేసిన రాయితీలన్నీ తిరగి ప్రవేశపెడతామని తెలిపారు. చీనీ రైతులకు కోల్డ్ స్టోరేజిలు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రెడ్డిపల్లి, కొండూరు, అట్లూరు గ్రామాల ప్రజలకు చెక్ పోస్టు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మిషన్ రాయలసీమ కార్యక్రమంలో రైతుల సమస్యలు పరిష్కారం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటుకు కావాల్సిన చీనీ రకాలు పెంచేలా ప్రోత్సహిస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్టుబడి తగ్గేలా ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అన్ని తక్కువ రేటు కి అందజేస్తామని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. గతంలో ఇచ్చినట్టే డ్రిప్ సబ్సిడీలో అందజేస్తామన్నారు. కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చీనీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. మరో ఏడాది ఓపిక పట్టండి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చీనీ రైతుల్ని ఆదుకుంటామన్నారు. రైతుల్ని ఆదుకోవడానికి తన వద్ద కొన్ని ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ఖర్చుచేయాల్సిన 28,147 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించిన దళిత ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి అన్యాయం చేశారని తెలిపారు. దళితుల నుండి 12 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కున్నారని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ విదేశీవిద్య ద్వారా దళిత విద్యార్థులను విదేశాలకు పంపి చదివించామని తెలిపారు. అధికాంలోకి వచ్చిన తరువాత గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తామన్నారు. గిరిజనులు స్వేచ్ఛగా అడవుల్లోకి వెళ్లి వెదురు తెచ్చుకునే హక్కు కల్పి స్తామన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు సబ్సిడీ రుణాలు అందజేస్తాం, గిరిజనులకు పోడు భూములు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి కమార్తె కైవల్యా రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు.

యువగళం కాదు.. యమగళం

రానున్న ఎన్నికల్లో 175 సీట్లు గెలవబోతున్నాం
రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ప్రస్తుతం లోకేష్ చేస్తున్న పాదయాత్ర యువగళం పాదయాత్ర కాదు యమగళం పాదయాత్ర రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి విమర్శించారు శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏమాత్రం అవగాహన, రాజకీయాలు పరిజ్ఞానం లేకుండా లోకేష్‌బాబు విమర్శలు చేయడం తగదన్నారు. నారా చంద్ర బాబునాయుడు వెన్నుపోటుతో రాజకీయంగా ఎదిగారని వాపోయారు. 14 ఏళ్ల టిడిపి పాలనలో చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు తనను, జడ్‌పి చైర్మన్‌ను నారాలోకేష్ విమర్శించడం సిగ్గుచేటని, ఇదంతా స్క్రిప్ట్ చదవడంలా ఉందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో ఉన్న ఒక్కరైనా కనీసం వార్డు మెంబరుగానైనా గెలిచారా అని ప్రశ్నించారు. కేవలం దొడ్డిదారిలో పదవులు పొందిన వారేనని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేసి స్వర్గీయ ఎన్‌టిఆర్‌కు నిజమైన నివాళి అర్పించార్పించారన్నారు. సుమారు రూ. 800 కోట్లతో రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. రాజంపేట జిల్లా తేలేకపోయినా, అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని ఆయన అన్నారు . ఇసుక వ్యాపారం తాను కానీ, తన కుటుంబం కానీ చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతానని, నిరూపించకపోతే లోకేష్ వైదొలుగుతారా అని సవాల్ విసిరారు. 2 వేల ఎకరాలు భూమినీ కబ్జా చేశానని ఆరోపిస్తున్నారని, తనపేరుపై ఉంటే తనకు ఐదెకరాలు ఇచ్చి మిగిలింది ఆయన్ను తీసుకోవచ్చని చెప్పారు. పాదయాత్ర అంటే సాయంత్రం పూట చేసే నడక కాదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు వైసిపి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజంపేట పట్టణ అధ్యక్షులు కృష్ణారావు, వైసిపి రాజంపేట మండల కన్వీనర్ రామ్మోహన్ నాయుడు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు, రాజంపేట వార్డు కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, రాజంపేట జెఎసి కన్వీనర్లు వడ్డే రమణ, మందిరం గంగిరెడ్డి, సీనియర్ వైసిపి నాయకులు గడికోట సుబ్బారెడ్డి, సిద్ధవటం మండల వైసిపి నాయకులు కంఠ రెడ్డి మురళి, ఆచారి సత్యాల రామకృష్ణపాల్గొన్నారు

ప్రజలకు విద్యుత్ షాక్ ఇస్తున్న ప్రభుత్వం

ఏడు సార్లు పెరిగిన విద్యుత్ ఛార్జీలు
మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడంతో రాష్ట్రంలోని రైతులతో పాటు ప్రజలు తీవ్ర విద్యుత్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బోస్ నగర్ లోని టిడిపి నూతన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 సంవత్సరం నాటికి గుజరాత్ తర్వాత గ్రామీణ ప్రాంతాలలో 100 శాతం విద్యుత్ సరఫరా చేసిన రాష్ట్రంగా ఎంపి నిలిచిందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 38 లక్షల కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇస్తే వైసిపి కేవలం 8 లక్షల కనెక్షన్లతో సరిపెట్టిందన్నారు. 2014 సంవత్సరంలో 9529 ఉన్న ఇన్‌స్టాల్ కెపాసిటీని 24,184 పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. టిడిపి హయాంలో ఒక్క రూపాయి విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని, సైకో జగన్ అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపాలని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి హాయంలో 50 యూనిట్లకు వరకు యూనిట్‌కు 1.45 ఉండగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 75 యూనిట్లకు రూ. 3 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రభుత్వం రూ. 369 కోట్ల భారాన్ని 1,47 వేల కోట్ల కుటుంబాలపై 14.65 వాణిజ్య, 1.63 లక్షల హర్ష విద్యుత్ కనెక్షన్లను మోపిందన్నారు. అంతేగాక అదనపు లోడ్ ఛార్జీ పేరుతో వినియోగదారులపై రూ.2000 నుండి రూ.5000 వరకు భారాన్ని మోపుతూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కస్టమర్ చార్జీల పేరుతో ప్రభుత్వం రైతుల నుంచి నెలకు 30 దోచుకుంటుందని, ఇది రైతు వ్యతిరేక చర్య అన్నారు .కేంద్రం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలకును తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుంటే జగన్ రెడ్డి మాత్రం తనపై ఉన్న కేసుల నుంచి బయటపడేందుకు కేంద్రం నిర్ణయాలకు వంతపాడుతున్నారని విమర్శించారు. డిస్కంలో సగటు విద్యుత్ ధర యూనిట్ కు రూ.4.75 లు ఉండగా జగన్ ప్రభుత్వం మాత్రం బహిరంగ మార్కెట్లరూ.8.77 వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేసిందన్నారు. దీంతో 2019 నుండి 2022 వరకు ఏడాదికి గాను రూ. 600 కోట్లు భారం ప్రజలపై పడిందన్నారు. టిడిపి ప్రభుత్వంలో 2015 నుండి 19 వరకు రాష్ట్రంలో విద్యుత్ అవసరాల కోసం రూ.20,246 కోట్లు ఖర్చు చేయగా ఈ ప్రభుత్వం 2019 నుండి 2023 మధ్యకాలంలో ప్రజల నుండి భారీ మొత్తంలో విద్యుత్ టారీఫ్ లు, జరిమానాలు వసూలు చేసినప్పటికీ కూడా కేవలం రూ.25.367 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసమర్థత కారణంగా విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడంతో రాష్ట్రం నుంచి ఎన్నో పరిశ్రమలు వదిలి వెళ్ళిపోతున్నాయని ఆరోపించారు .రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, లక్కిరెడ్డిపల్లి మండల టిడిపి అధ్యక్షులు జయరాం, సంబేపల్లి మండల నాయకులు మల్లు విష్ణువర్ధన్ రెడ్డి, కంకర , నరసింహారెడ్డి పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్ చొరవతో దొరికిన తపాలా శాఖ పార్శిల్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఏమరపాటున తపాలా డాక్ సేవకుడు పోగొట్టుకున్న విలువైన పార్సిల్‌ను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి చొరవతో పారిశుధ్య సిబ్బంది శనివారం కనుగొన్నారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష జవాబు పత్రం, ముగ్గురు పాలిటెక్నిక్ విద్యార్థుల జవాబు పత్రాలతో పాటు, ఉత్తరాలతో కూడిన విలువైన పార్సిల్‌ను తరలిస్తుండగా తపాలా శాఖకు చెందిన డాక్ సేవక్ శుక్రవారం ఏమరు పాటున పార్సిల్ పోగొట్టుకున్నారు. పార్శిల్ పోయిన విషయాన్ని సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రకటించడంతో పాటు మున్సిపల్ చైర్మన్ తపాల పార్సిల్ వంటివి చెత్తలో వచ్చి ఉంటే వెతకమని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. అదే సమయంలో పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించగా పాత బస్టాండ్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద పార్సిల్ పోయినట్లు గుర్తించారు. అప్పటికే చెత్తలో వెతికే పనిని ప్రారంభించిన పారిశుధ్య సిబ్బంది కార్తీక్ పాత బస్టాండ్ ప్రాంతంలో కనుగొన్నారు. పార్సిల్‌ను కార్తీక్ శానిటేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ రాజేష్, మేస్త్రి బాలాజీ, తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్‌కు అప్పగించారు. మున్సిపల్ చైర్మన్ చొరవతో ఎట్టకేలకు పార్సిల్ దొరకడంతో ఆయా శాఖల వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



అన్నదానం చేస్తున్న అభిమానులు

పట్టణంలోని నీరుగట్టువారిపల్లి మార్కెట్ యార్డ్ అన్నా క్యాంటీన్ వద్ద బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో అగ్రకథా నాయకులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పట్టణ ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా శనివారం మదనపల్లి బాలయ్య ఫ్యాన్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకా ంక్షలు తెలిపారు. పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బాలయ్య బాబు సీనియర్ అభిమానులకు శాలువలతో సత్కరించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్, దొమ్మలపాటి యశస్విరాజ్, రాష్ట్ర చేనేత నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, ప్రభాకర్, హోటల్ శంకర, పల్లపు రమేష్, రామకృష్ణ, డాన్స్ రెడ్డి, వేల్పుల వెంకటేష్, ఆదినారాయణ, ఎన్ిఆర్ ఫ్యాన్స్ రాజేష్, వేణు, రెడ్డిశేఖర్, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, పి.సురేందర్ యాదవ్, రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు రామిశెట్టి నీలకంఠ, పట్టణ టిడిపి అధ్యక్షులు జోలపాలెం, భవానీప్రసాద్, త్యాగరాజు,సురేంద్ర యాదవ్, అభిమానులు పాల్గొన్నారు.

నృత్య సాధనతో మానసిక వికాసం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నృత్య సాధనతో ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం లభిస్తుందని, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలోనూ రాణించాలని టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఎ.బి చంద్ర రెడ్డి ఫంక్షన్ హాల్‌లో డ్యాన్స్ మాస్టర్ పెనిగలపాటి శివ ప్రసాద్ అధ్యక్షతన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్ మోహన్ రాజు, అన్నమయ్య జిల్లా కాకతీయ సేవా సమితి అధ్యక్షులు గొల్లపూటి శివ నారాయణ చౌదరి, శ్రీ సాయి విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలరాజు, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ సునీల్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నృత్య కళాకారుల వెస్టర్న్, శాస్త్రీయ నృత్యంతో పాటు మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల ఒళ్ళు గగుర్పొడిచే విన్యాసాలతో అహూతులను అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొన్ని వేల మంది విద్యార్థులకు నృత్య శిక్షణ ఇస్తూ పేద, ధనిక అన్న తేడా లేకుండా నృత్య కళను అందరికీ చేరువ చేస్తూ ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన మాస్టర్ శివప్రసాద్ కళాకారులకు ఆదర్శప్రాయుడని తెలిపారు. కేవలం నృత్యమే కాకుండా మార్షల్ ఆర్ట్స్, సంగీతం, చిత్రలేఖనం వంటి వివిధ అంశాలలో తన అకాడమీ ద్వారా శిక్షణ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. శివ ప్రసాద్ ఎందరో కళాకారులను నృత్య గురువులుగా తీర్చిదిద్దారని తెలిపారు. చిన్నారులు చదువుతోపాటు చిన్నతనం నుంచి వివిధ కళల రంగాలలో రాణించాలని తెలిపారు. నృత్య సాధన వలన శరీరం ఆరోగ్యంగా ఉండడంతో పాటు మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుందని, తద్వారా పిల్లలు చదువులో కూడా రాణించగలుగుతారని పేర్కొన్నారు. నృత్య కళ ద్వారా ఆరోగ్యం, ఆహ్లాదం పొందడంతో పాటు ఉపాధి కూడా పొందవచ్చునని తెలిపారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు



శివ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి రాజంపేట రూరల్

అంగన్వాడీ పోస్టులకు ఎంపికైన ఆయాలకు శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అ ఆయాలతో మాట్లాడుతూ కేంద్రాల్లో చదువుకుంటున్న పిల్లలను తమ పిల్లలుగా భావించి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు కార్యక్రమంలో సిద్ధవటం మండల జడ్‌పిటిసి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ వైసిపి నాయకులు గడికోట సుబ్బారెడ్డి , మాజీ సర్పంచ్ ఉమ్మడి మదన్మోహన్ రెడ్డి ,అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, వైసిపి రాష్ట్ర యువజన నాయకులు నడివీధి సుధాకర్ , నందలూరు మండల కో – ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మాంసం ధరలను తగ్గించాలి : కాంగ్రెస్

రాజంపేట అర్బన్ : రాజంపేట పురపాలక పరిధిలోని మాంసం దుకాణాలలో కిలో రూ.900 లకు విక్రయిస్తూ దుకాణా దారులు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారని., వెంటనే ప్రజలకు సరసమైన ధరలలో అందిచేలా మున్సిపల్ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కిలో మాంసం రూ. 750 ఉంటే మున్సిపాల్టీ పరిధిలో రూ 900 ఉందని అన్నారు. మాంసాహారులు మాంసం ముట్టుకోవాలంటేనే భయపడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీ అధికారులు మాంసం దుకాణాలను పరిశీలించి వాటి విక్రయాల నాణ్యత, ధరలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాలివీడు రహదారి మార్గంలో డాక్టర్ చింతల నాగసుబ్బారెడ్డి, డాక్టర్ బిందు ప్రసూన ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సురక్ష మదర్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిని ప్రారంభించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వాహకులు ప్రజలకు విలువలతో కూడిన వైద్యం అందించాలన్నారు. ప్రజల ఆశీర్వాదాలే లక్ష్యంగా వైద్యం అందించాలని కోరారు. జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత రాయచోటిలో ఆధునాతన వైద్యసేవలు ఒక్కొక్కటిగా అందుబాటులో వస్తుండటం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వమూ ప్రజలకు ఎక్కడికక్కడ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రతి పార్లమెంట్‌లో వైద్య కళాశాలల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు అందేలా నూతన పరికరాల ఏర్పాటు, ఆసుపత్రుల్లో పడకల పెంపు, వైద్య సిబ్బంది నియామకం లాంటి చర్యలు వేగంగా అమలు చేస్తున్నామన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



విద్యార్థికి చెక్కును అందిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

విద్యార్థికి రూ.60 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థి చదువుకోసం ముక్కా రూపానందరెడ్డి రూ.60 వేలు అందించి తన దాతృత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని బొమ్మవరం పంచాయతీ లోని పెరురి ముసలయ్య ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భార్య పద్మావతి ముక్కా రూపానందరెడ్డిని కలసి తన కుమారుడు చదువు కోసం ఆర్థిక సాయం చేయాలని కోరడంతో ఆయన వెంటనే స్పందించి ముక్కా రూపానంద ఫౌండేషన్ ద్వారా రూ.60వేలు ఆర్థికసాయం చెక్కు ద్వారా అందిచారు. కార్యక్రమంలో బొమ్మవరం నారాయణారెడ్డి, డిఆర్ యుసిసి బోర్డుమెంబర్ భారత్ కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి గౌరీ శంకర్‌రాజు, వేణుగోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మోహన్

కుటుంబ ఆరోగ్య సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

జాతీయ కుటుంబ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సర్వే సూపర్వైజర్ మోహన్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 6వ విడత ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సర్వేలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో పిహెచ్‌సి పరిధిలో కలకడ ప్రాంతాన్ని రాండమ్ సర్వే మెదలు పెట్టారు. ఈ మేరకు శనివారం సర్వే సూపరవైజర్ అధ్వర్యంలో బృందం సర్వే చెప్పటారు. సర్వే వివరాలు ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ పాపులేషన్ సైన్స్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ వెంకటేశు, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆదర్శ పాఠశాలలో నేడు జరిగే ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు అంత సిద్ధం చేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటలనుండి 12 గంటల వరకు జరుగుతుందని, ఇందులో అర్హత సాధించిన వారు ఆదర్శ పాఠశాలలో చదివేందుకు అర్హత పొందుతారని ఇప్పటికే పరీక్ష కావాల్సిన ప్రశ్నాపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం జరిగిందని, అలాగే పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. పరీక్ష సమయం కంటే ఒక గంట ముందుగానే విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు చేరుకోవాలని తెలిపారు.

కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుల నియామకం

ప్రజాశక్తి-కలికిరి

కాంగ్రెస్ పార్టీ పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ వర్ధన్‌చౌదరిలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి సోమ్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని అసెంబ్లీలకు కో-ఆర్డినేషన్ కమిటీలు వేయడంతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీగా ఉన్న ఆయన అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా నియమించడంతో తన పై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. వీరితో పాటు అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా నియమితులైన మల్లికార్జున అలాగే మిగిలిన పదకొండు మంది సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. **పీలేరు :** పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా ప్రముఖ న్యాయవాది పి.చాంద్‌బాషాను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. పి.చాంద్‌బాషా మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని అసెంబ్లీలకు కో-ఆర్డినేషన్ కమిటీలు వేయడంతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుం దన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన తన రాజకీయ గురువు డాక్టర్ ఎన్. తులసిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు దాదా గాంధీ, మహమ్మద్ రఫీ, మహబూబ్‌బాషా, కో-ఆప్షన్ సభ్యులు, ఎస్ఎండి గౌస్, కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సరిత తేజసాయిప్రతాప్‌కు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం చేసి అభినందించారు. క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి రాజంపేటకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, పట్టణ జెఎసి కన్వీనర్ వడ్డే రమణ, రాజంపేట కౌన్సిలర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

పులి సత్యారెడ్డి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కలికిరి



సత్యారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

పట్టణంలోని స్థానిక ధరణి హోటల్ యజమాని, రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని భారీ కేక్ కట్ చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘానికి చేసిన సేవలు ఆదర్శనీయమని కొని యాడారు. పార్టీలకతీతంగా నాయకులు, ఆయన అభిమానులు శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలో మరింత ఉత్సాహంగా రెడ్డి సంక్షేమ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమసంఘం సభ్యులు రాంప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తాతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సహదేవరెడ్డి, సురేష్‌రెడ్డి, చింతపర్తి సర్పంచ్ శేషాద్రిరెడ్డి, ఆదిరెడ్డి, ఎల్లారెడ్డి, దాబా చంద్రారెడ్డి, పాలశివారెడ్డి, జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం ముష్టూరు పంచాయితీలోని దిగువపల్లెలో సర్పంచు చెంద్రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్ లెట్ ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి నేరుగా తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, అధికారుల పనితీరు ఎలా ఉంది, సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలంటూ ప్రజలను అడిగారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, తాగునీటి కొళాయిలు ఏర్పాటు, పింఛన్లు, వికలాంగ పింఛన్లు, దారి ఏర్పాటు, రేషన్ కార్డుల మంజూరు, ఆరోగ్యశ్రీ కార్డులో మార్పులు, అధికంగా రెవిన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రాయుడు, సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణ, వైసిపి పార్టీ నాయకులు సి.వి.రమణారెడ్డి, నరేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రాజగోపాల్, రెడ్డి భాస్కర, కొండగాళ్ల రమణ తహసిల్దార్ సి.ఆర్.మంజుల, ఎంపీడీవో లీలా మాధవి, ఎస్ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం అట్టహాసంగా ముగిశాయి. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ శంకరయ్య, ఎంఇఒ రెడ్డిశేఖర్, నగర పంచాయతీ ఎఒ రమాదేవి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనునాయక్, బాలికొన్నత పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచి గ్రంథాలయాలను వినియోగించుకోవడం వలన ఎంతో విజ్ఞానవంతులు అవుతారని అన్నారు. అనంతరం ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో పిల్లలు బయట తిరగకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నందుకు పిల్లలందరినీ అభినందించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శీను నాయక్ మాట్లాడుతూ ఇటువంటి వేసవి శిక్షణ శిబిరాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో నిర్వహించిన వివిధ రకాల అంశాలు పోటీలు నిత్యజీవితంలో కూడా అవలంబిస్తూ ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎం.తులసి నాయక్ మాట్లాడుతూ ఇప్పటివరకు వేసవి శిక్షణ శిబిరాలు పాల్గొన్న విద్యార్థులు అందరికీ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలని, పిల్లల తల్లిదండ్రుల ద్వారా కూడా సభ్యత్వం తీసుకుంటే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను విరామ సమయంలో ఇంటి వద్దకు తీసుకెళ్లి చదువుకొనుటకు వీలవుతుందన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలలో పిల్లలకు ప్రత్యేకంగా రూ.50కే సభ్యత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు బహుమతులు ప్రదానం చేశారు.

పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు

ప్రజాశక్తి-పుల్లంపేట



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోకి జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ ఆదర్శపాఠశాల నుంచి జగనన్న విద్యా కానుక కిట్లలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య మండలంలోని పాఠశాలలకు విద్యాకానుక ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, ఒక స్కూల్‌బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు, రెండు జతల బూట్లు, ఒకటవ తర గతిలో చేరిన విద్యార్థులకు, ఆరవ తరగతిలో చేరిన విద్యార్థులకు డిక్షనరీలు స్టాక్ పాయింట్ నుంచి మండల సిబ్బంది ద్వారా పాఠశాలలకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపిణీ చేశామన్నారు. మండలంలోని విద్యార్థులకు నాణ్యతతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాలల ప్రధానో పాధ్యాయులు జూన్ 12న పాఠశాల ప్రారంభం రోజున గ్రామంలోని ప్రజా ప్రతినిధులను, కమిటీ సభ్యులను, గ్రామ పెద్దలను ఆహ్వానించి వారి చేతులు మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయాలని, విద్యార్థులు బయోమెట్రిక్ హాజరు వేయించుకోవాలని తెలిపారు.

ఫైనల్స్‌కు రైజింగ్ స్టార్స్, నాని లెవెన్స్ జట్లు

ప్రజాశక్తి-నందలూరు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్న చందు

నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల మూడవ తేదీ ప్రారంభమైన మండల స్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నందు అరవపల్లి కి చెందిన రైజింగ్ స్టార్, నాని లెవెల్స్ ఫైనల్స్ లో ప్రవేశించాయి. ఉదయం జరిగిన మొదటి సెమీ ఫైనల్స్ నందు భవిన్స్ ఇసుకపల్లి జట్టు టాస్ గెలిచి నాని లెవెల్స్ కు బ్యాటింగ్ అప్పజెప్పింది. నాని జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 122 పరుగులు చేయడం జరిగింది. ఆ జట్టులోని సింగ్ అత్యధికంగా 49 పరుగులు చేయగా, ఇసు కపల్లి బౌలర్లు అనిల్ 3, విష్ణు మూడు వికెట్లను పడగొట్టారు. అనంతరం 123 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ఇసుకపల్లి జట్టు 15 ఓవర్లతో ఏడు వికెట్లను కోల్పోయి109 పరుగులు చేసి పరాజయం చెందింది. ఆ జట్టు బ్యాట్స్‌మేన్‌లు రమణ 28, అనిల్ 26 పరుగులు చేయడం జరిగింది. నాని జట్టు బౌలర్ సింగ్ మూడు ఓవర్లు వేసి 17 పరు గులు ఇచ్చి రెండు వికెట్లను పడగొట్టాడు. నాని 11 జట్టు మొదట ఫైనల్ బెర్త్ కు అర్హత సాధించింది. సింగ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీఫైనల్స్‌లో మిథేష్ లెవెన్ నందలూరు రైజింగ్ స్టార్ అరవపల్లె జట్ల మధ్య పోరు రసవత్తరంగా మారింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ జట్టు 15 ఓవర్లలో 153 పరుగులు చేయగా, ఆ జట్టులోని బ్యాట్స్మెన్ బుల్లెట్ హరి 28 బంతుల్లో 42 పరుగులు, చందు 17 బంతుల్లో 36 పరుగులు చేయడంతో పాటు నాట్ అవుట్ బ్యాట్స్మెన్ గా నిలిచాడు. నందలూరు బౌలర్ సురేష్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 154 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన నందలూరు మితేష్ జట్టు 15 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 75 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఆ జట్టులోని హరి అత్యధికంగా 21 పరుగులు చేశాడు. రైజింగ్ స్టార్ బౌలర్లు శివకోటి మూడు ఓవర్లలో 12 పరు గులు ఇచ్చి మూడు వికెట్లు, చందు ఒక ఓవర్ వేసి ఒక వికెట్ తీశాడు.36 పరుగులు చేసి నాటౌట్ గా నిలవడంతోపాటు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన చందుకు మేన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. ఆదివారం ఉదయం రైజింగ్ స్టార్, అరవపల్లె నాని జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా జరగనుంది. ఏ జట్టు గెలిచిన అరవపల్లికే రెండు బహుమతులు ఖాయం అవ్వడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



బాధితునికి ఆర్థిక సాయం చేస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

బాధితునికి ఆర్థిక భరోసా

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లె గంగమిట్టలో నివసిస్తున్న పొగడ్త విజయకుమార్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత సరిపోకపోవడంతో ఇబ్బంది పడుతుండటంతో విషయం తెలుసుకున్న రాజంపేట నియోజకవర్గపు యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి శనివారం బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధితుని తల్లి మాట్లాడుతూ తన కుమారునికి నలుగురు ఆడపిల్లలని, ఆరోగ్యం సరిగా లేనందువలన రోజువారి పనులకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మేడా విజయ శేఖర్ రెడ్డి వైద్య చికిత్సకు అయ్యే ఖర్చును తన వంతు తాను సహాయాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనుంజయ నాయుడు, గిద్దలూరు వెంకటేశ్వర్లు, శివయ్య, సింగనమల దుర్గారెడ్డి, మణి, గిద్దలూరు సుబ్బ నరసయ్య, రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమం

నందలూరు : నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మతల్లి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన శనివారం ఆలయంలో ఉదయం 6:30 గంటలకు కలశ స్థాపన, చండీ హోమం అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, మూల మంత్ర హెూమములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ విశేష పూజలకు రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి, స్మిత దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించడంతో పాటు, ఉత్సవాలకు లక్ష రూపాయలు విరాళంను ఉత్సవ నిర్వాహకులకు అందించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని విజయశేఖర్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ ఉత్సవాలలో నాగిరెడ్డిపల్లె ప్రజలు పాల్గొన్నారు.

కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని బండ్రేవు పంచాయతీ కొత్తపల్లిలో వెలసిన శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయంలో శనివారం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల నూతన విగ్రహప్రతిష్టాపన గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం నాడుకలశస్థాపన, విగ్రహాలకు, జలదివాసము, మహామంగలహారతి, శుక్రవారం గణపతిపూజ, దీక్షా హామలు, నిర్వహించి శనివారంనాడు విగ్రహ ప్రతిష్ఠ చేచారు, అనతరం సీతారాములస్వామివారి కల్యాణము, వేదమంత్రాలతో నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు కట్టా నాగభూషణం, కట్టాపవన్ కుమార్‌శర్మ, గ్రామస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిఆర్ఎల్ బస్సు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని పిఆర్ఎల్ బస్సు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల నుండి అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని, బస్సు యాజమాన్యంపై రవాణా శాఖా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలు, డిమాండ్ బట్టి ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కావల్సిగానే సీట్లు బ్లాక్ చేసి ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ బస్సు ఛార్జీలు రూ.650 ఉంటే వీరు రూ.700 నుండి రూ.900 వరకు అదనంగా ఛార్జీలు అవసరాన్ని బట్టి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలకు వెయిటింగ్ గదులు లేవన్నారు. బస్సు పార్కింగ్ పాయింటు కూడా లేకుండా నడుపుతున్నారన్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన జాశ్రిత

ప్రజాశక్తి-పుల్లంపేట



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన జాశ్రిత

మండల పరిధిలోని అనంత సముద్రం గ్రామంలో నివాసం ఉన్న ముద్ద ప్రకాష్‌రెడ్డి మనవరాలైన జాశ్రితరెడ్డి తిరుపతి డిస్నీ వోక్స్ పాఠ శాలలో నర్సరీ చదువుతున్న రెండు సంవత్సరాల ఎనిమిది నెలల జాశ్రిత ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ 2023 సాధించినట్లు మామ విజయ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, కుటుంబ సభ్యులు జాషిత రెడ్డిని అభినందించారు. జాషితా రెడ్డి ఉన్నత శిఖరా లను అధిరోహించాలని ఇలాంటి అవార్డ్స్ ను మరెన్నో తీసుకోవాలని, ఇతర దేశాలలో కూడా అవార్డును సొంతం చేసుకుని తల్లిదండ్రులకు పాఠశాలకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

విద్యార్థులు కళలలో కూడా రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చిన్నారులు చదువుతోపాటు చిన్నతనం నుంచే వివిధ కళల రంగాలలోనూ రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పోలా శ్రీనివాసులురెడ్డి, బిజెపి రాష్ట్ర పొలిటికల్ ఫీడ్ బ్యాక్ కమిటీ సభ్యులు, రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి సాయి లోకేష్ తెలిపారు. శనివారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో ఎఆర్ డాన్స్ అకాడమీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు డ్యాన్స్ మాస్టర్ అభిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో చిన్నారులు చేసిన వెస్టర్న్, శాస్త్రీయ నృత్యాలు, ఒళ్ళు గగుర్పొడిచే మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, సాయి లోకేష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు, కళలు గౌరవించబడినచోట ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. చిన్నారులు చదువుతోపాటు సాంస్కృతిక కళలలో కూడా రాణించాలని తెలిపారు. నృత్య సాధన వలన శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుందని తద్వారా పిల్లలు చదువులో కూడా రాణించగలుగుతారని అన్నారు. ఆడుతూ పాడుతూ శరీరానికి వ్యాయామాన్ని ఇచ్చేదే డాన్స్ అని తెలిపారు. ఎఆర్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్యాన్స్ తో పాటు మార్షల్ ఆర్ట్స్, మ్యాజిక్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కళలలో శిక్షణ ఇస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలాటం హరి, ఎపిఎంఆర్‌పిఎస్ నాయకులు బొజ్జా పెంచలయ్య, హిపాప్ స్టైల్ డ్యాన్స్ మాస్టర్ సాయి వంశీ రెడ్డి, స్టూడియో సుబ్బు పాల్గొన్నారు.

షబ్బీర్ హుస్సేన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి ఐటిడిపి కన్వీనర్ షబ్బీర్ హుస్సేన్ సేవలు అభినందనీయమని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కొనియాడారు. మండలంలో సామాన్య కార్యకర్తగా ఉండే ఆయన పార్టీకి చేసిన సేవలను నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గుర్తించి ఐటిడిపి మండల కన్వీనర్ గా బాధ్యతలు అప్పజెప్పారు. మరింత ఉత్సాహంతో వాట్సాప్, ఫేస్‌బుక్, తదితర సోషల్ మీడియాలో టిడిపి కార్యకలాపాలను విస్తృతంగా ప్రచారం చేసి రాష్ట్రంలోనే పది లోపు ర్యాంకును సాధించారు. ఈయన సేవలను కొనియాడుతూ నిన్న జరిగిన ఐ టిడిపి అభినందన సభలో చంద్రబాబు షబ్బీర్ హుస్సేన్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ హుస్సేన్ మాట్లాడుతూ కిషోర్‌కుమార్‌రెడ్డి చొరవతో చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

క్రైం కార్నర్

ముగ్గురు నాటుసారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం మండలంలోని పలు ప్రాంతాలలో నాటుసారా విక్రయ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయనపల్లికి చెందిన రమణ అనే వ్యక్తి నాటు సారాను అమ్ముతుండగా అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీ బాలేవాండ్లపల్లెకు చెందిన రెడ్డిరాజా, వసంత శేఖర్‌లు చిన్నంవారిపల్లెకు సమీపంలో నాటు సారా విక్రయిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కోడిపందెం స్థావరంపై స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి పంచాయతీలోని నాగులయ్యగారిపల్లి వద్ద శనివారం కొంతమంది కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఆ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి కోడిపందెం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు పందెం కోళ్లను, రూ.1500 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

ఇళ్లపైకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



ప్రమాదానికి కారణమైన కారు

అతివేగంగా ఓ కారు ఇళ్లపైకి దూసుకెళ్లిన ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మదనపల్లి నుంచి బి.కొత్తకోట వైపు వెళ్తున్న ఓ కారు మార్గమధ్యంలోని పత్రవారిపల్లె వద్దకు రాగానే వేగంగా నివాసాల మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. గాయపడిన వారు బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఎం.విష్ణు,కె.తరుణ్,సి,తౌహిద్ లుగా గుర్తిం చారు. గాయపడ్డ వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు చికిత్సను అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు విచారణ చేపట్టారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి-రామసముద్రం



లక్ష్మీదేవి(ఫైల్‌పోటో)

పట్టపగలు మహిళ దారుణ హత్యకు గురైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. .రామసముద్రం మండలం కే.సిపల్లి గ్రామ పంచాయతి ఓబులరెడ్డి గారిపల్లి గ్రామ సమీపంలోని ప్రకాష్ రెడ్డి పొలంలో లక్ష్మీదేవి అనే మహిళ (55) దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి భర్త శంకర్‌రెడ్డి వివరాల మేరకు ..గత 30 సంవత్సరాలుగా భార్యాభర్తలు ఇద్దరు కలిసి పుంగనూరు పట్టణం ఉబెదుల్లా కాలనిలో నివాసముంటూ జీవనం సాగిస్తు గత రెండు సంవత్సరాలుగా ఓబురెడ్డిగారిపల్లి గ్రామం సమీపంలోని రైతు ప్రకాష్‌రెడ్డి పొలంలో గొర్రెల మేపుకొని, మామిడి తోటకు కాపులగా ఉండి జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం శంకర్ రెడ్డి తన సొంత పని మీద ఉప్పినల్లి గ్రామానికి వెళ్లి తిరిగి పొలం దగ్గరకు రాగా తన భార్య విగతా జీవిగా పడిఉండటం చూసి ఒక్కసారిగా తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సంఘటన శంకర్‌రెడ్డి వెంటనే పుంగునూరు పోలీసులకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న పుంగునూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పుంగనూరు పోలీసులు ఘటన ప్రాంతం తమ పరిధిలోకి రాదని రామసముద్రం పిఎస్ పరిధని రామసముద్రం పోలీసులకు సమాచారం అందించారు. మదనపల్లి డిఎస్పి కేశప్ప పర్యవేక్షణలో మదనపల్లి రూరల్ సిఐ శివాంజనేయులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.